సాక్షి
ఒడిశా
మంగళవారం । 11 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,12,853లు, బంగారం 280 మిల్లీగ్రాములు, వెండి 22 గ్రాముల 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



తాగునీటి కోసం ఆందోళన

తమ గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని గొకులముండ గ్రామానికి చెందిన మహిళలు ఆందోళన చేపట్టారు.

- 8లో.



నదిలో వృద్ధుడి మృతదేహం

సబ్ డివిజన్ కుంద్రా సమితి కెరమటి గ్రామ పంచాయతీ కొదలిముండ గ్రామ సమీప కురులు నదిలో ఒక వృద్ధుడి మృతదేహం సోమవారం తేలుతూ కనిపించింది.

- 8లో.

న్యూస్‌రీల్

అనురాధ పడ్వాల్‌ని కలిసిన ఎంపీ బలభద్ర



అనురాధ పడ్వాల్‌తో ఎంపీ బలభద్ర మజ్జి

కొరాపుట్: ప్రముఖ నేపథ్యగాయకురాలు అనురాధ పడ్వాల్‌ను నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు బలభద్ర మజ్జి పార్లమెంట్ ఆవరణలో సోమవారం కలిశారు. ఉత్కళ ప్రజలు అనురాధ గీతాలను అధికంగా అభిమానిస్తారు. ఈ విషయం అనురాధకి గుర్తు చేశారు. హిందీ, ఒడియా తదితర భాషల్లో దాదాపు 9000 పాటలను ఆమె పాడారు. ప్రస్తుతం ఆమె బీజేపీలో చేరి సేవలందిస్తున్నారు.

ఎంపీ సప్తగిరితో ఛత్తీస్‌గడ్ పీసీసీ అధ్యక్షుడు భేటీ



ఎంపీ సప్తగిరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దీపక్

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కతో ఛత్తీస్‌గడ్ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దీపక్ బైజ్ భేటీ అయ్యారు. సోమవారం న్యూఢిల్లీలోని ఉల్క నివాసానికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వీరిద్దరికీ అపూర్వమైన స్నేహం ఉంది. సప్తగిరి ఉల్క ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా ఉన్నారు. అక్కడ సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు దీపక్‌తో కలిసి చాలా రోజులు ప్రచారం చేశారు. అందుకు కృతజ్ఞతగా ఉల్క కొరాపుట్‌లో పోటీ చేసినప్పుడు దీపక్ కొరాపుట్‌లో 4 రోజులు మకాం వేసి ప్రచార బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉల్క గెలుపొందడంతో దీపక్ భేటీ అయ్యారు.

409 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులు, పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న పోలీసులు

కొరాపుట్: జిల్లాలోని నందపూర్ ఎస్‌డీపీవో పరిధి మాచ్‌ఖండ్ పోలీసులు 409 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జయపూర్ మీదుగా నందపూర్ వైపు రెండు కారుల్లో గంజాయి తరలిస్తున్నట్లు కొరాపుట్ ఎస్పీ అభినవ శంకర్‌కి సోమవారం సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. దీనిలో భాగంగా రెండు కారులపై దాడులు చేయగా మొత్తం 18 ప్యాకెట్లలో 409 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయి రవాణా చేస్తున్న ఝార్సుగుడ జిల్లాకి చెందిన మనోజ్ ఓరం, మహ్మద్ సర్ఫరాజ్‌లను అరెస్ట్ చేశారు. ఎస్ఐ గోవింద చంద్ర హన్సద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18 నుంచి పాఠశాలల పునః ప్రారంభం

భువనేశ్వర్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ సహాయక పాఠశాలలు వేసవి సెలవుల తర్వాత జూన్ 18న తిరిగి తెరవబడతాయి. పాఠశాల, సామూహిక విద్యా శాఖ ఈ విషయంలో అన్ని పాఠశాలలకు సూచనలను జారీ చేసింది. పాఠశాలల పునః ప్రారంభానికి అవసరమైన సన్నాహాలు చేయాలని ఆదేశించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. పాఠశాలల పునః ప్రారంభానికి ముందు అన్ని తరగతి గదులు, మరుగుదొడ్లు శుభ్రం చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తాగునీరు, మధ్యాహ్న భోజన సదుపాయం ముందుగానే ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయి తనిఖీ బృందాలు పాఠశాలలను సందర్శించి అన్ని క్లీనింగ్ పనులు పూర్తైనట్లు నిర్ధారిస్తారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, కుక్‌లు, వారి సహాయకులు పాఠశాలలు పునః ప్రారంభమయ్యే ఒక రోజు ముందు విధుల్లో చేరాలని ఆదేశించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, ఇంటర్నెట్ కనెక్షన్‌లతో కూడిన ఈ-లైబ్రరీకి అన్ని ఏర్పాట్లు చేయా లని జిల్లా విద్యాశాఖాధికారులకు (డీఈఓ) సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన వేడిగాలుల పరిస్థితుల కారణంగా ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 25 నుంచి వేసవి సెలవులు ప్రకటించి పాఠశాలలను మూసివేసింది. ముందస్తు ప్రకటన ప్రకారం వేసవి సెలవుల అనంతరం జూన్ 17న అన్ని పాఠశాలలు తెరుచుకోవాల్సి ఉంది. జూన్ 17న బక్రీద్ జరుపుకోనున్నందున, పాఠశాలల పునఃప్రారంభ తేదీని జూన్ 18కి వాయిదా వేస్తున్నట్లు పాఠశాలలు సామూహిక విద్యా శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

వీడని ఉత్కంఠ..?



- కొత్త సీఎం పేరుపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి
- రేపే ప్రమాణ స్వీకారం
- ఎంపికపై ఇద్దరి సభ్యుల బృందం

భువనేశ్వర్:

రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి పేరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన పూర్తి బలంతో భారతీయ జనతా పార్టీ ఇటీవల ముగిసిన ఎన్నికల్లో విజయం సాధించింది. ముఖ్యమంత్రి అభ్యర్థిని ఖరారు చేయడంలో బీజేపీ కేంద్ర నాయకత్వం, ప్రధానంగా పార్లమెంటరీ బోర్డు తక్షణమే ఒక నిర్ణయానికి రాలేని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోంది. ఈసారి ముగిసిన ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఓడిపోవడంతో ఈ పరిస్థితి చోటు చేసుకుంటున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేసులో ఆయన ముందంజ వేయడం గమనార్హం. ధీటైన ఆధిక్యతతో ఎన్నికల్లో గెలుపొందిన పలువురు ప్రముఖులు ముఖ్యమంత్రి పదవికి అర్హులుగా పోటీ పడడంతో పార్లమెంటరీ బోర్డు శక్తియుక్తుల్ని ప్రయోగించి వివాదరహితంగా ముఖ్యమంత్రి అభ్యర్థిని ఖరారు చేసే యోచనతో తలకిందులవుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం జరగాల్సిన రాష్ట్రంలో తొలి బీజేపీ ప్రభుత్వం ప్రమాణస్వీకారోత్సవం వాయిదా పడింది. ఎన్నికల ప్రచారంలో కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారోత్సవం ముహూర్తం (ఈనెల 10) ఖరారు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముందస్తు ఖరారు కార్యక్రమాలతో తీరిక లేనందున అనివార్య పరిస్థితుల్లో ప్రమాణస్వీకారం వాయిదా వేసినట్లు తాజాగా ప్రకటిస్తున్నారు.

● నేడు శాసనసభా పక్ష సమావేశం

కేంద్ర నాయకత్వం సంప్రదింపుల తర్వాత రాష్ట్రంలో బీజేపీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల 12వ తేదీ (బుధవారం) జరుగుతుందని భోగట్టా. ఈ క్రమంలో ముందు రోజు మంగళవారం స్థానిక రాష్ట్ర శాఖ కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేల సమావేశం జరుగుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సురేష్ పూజారి తెలిపారు. కొత్త ముఖ్యమంత్రి రేసులో ఆయన ముందంజ ఆశావాదిగా కసరత్తు చేస్తున్నారు. 64 ఏళ్ల సురేష్ పూజారి ఈసారి జరిగిన ఎన్నికల్లో బ్రజ్‌రాజ్ నగర్ నియోజకవర్గం నుంచి సమీప ప్రత్యర్థిపై 26,789 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు.

● పరిశీలకుల నియామకం

రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థిని ఖరారు చేసేందుకు బీజేపీ కేంద్ర నాయకత్వం 2 మంది సభ్యులతో ప్రత్యేక పరిశీలన బృందం నియమించింది. వీరిలో రాజ్‌నాథ్ సింగ్, భూపేందర్ యాదవ్ ఉన్నారని ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన కొత్త ఎమ్మెల్యే సురేష్ పూజారి తెలిపారు. పరిశీలకుల నిర్ణయం మేరకు కొత్త ముఖ్యమంత్రి ఖరారు కానున్నట్లు వివరించారు. బీజేపీ ఎమ్మెల్యేల ఏకగ్రీవ ఆమోదం ప్రామాణికంగా కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థి ఖరారు కానున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరగనున్న శాసనసభా పక్ష సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో పరిశీలకులుగా కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, భూపేంద్ర యాదవ్ పాలుపంచుకుంటారు. బీజేపీ ఎమ్మెల్యేల ఏకాభిప్రాయం ఆధారంగా తదుపరి ఒడిశా ముఖ్యమంత్రి పేరును ప్రకటించడంపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది.

● ప్రమాణ స్వీకారానికి పీఎం మోదీ

ఈనెల 12న కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. రాష్ట్రంలో 20 పార్లమెంటరీ స్థానాల్లో పార్టీకి పట్టం గట్టి తదుపరి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి స్పష్టమైన ఆదేశాన్ని ఇచ్చినందుకు రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపే రోడ్ షో నిర్వహించబడుతుంది. బుధవారం సాయంత్రం 4.45 గంటలకు రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార ముహూర్తంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మధ్యాహ్నం 2.10 గంటలకు భువనేశ్వర్‌కు చేరుకుంటారు.

● మహిళా అభ్యర్థుల్లో ఆసక్తి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టాలని ఎమ్మెల్యేలుగా గెలిచిన 2 మంది మహిళా అభ్యర్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. వీరిలో రాణాపూర్ స్థానం నుంచి గెలిచిన 63 ఏళ్ల సురమా పాఢి, 4,588 ఓట్ల ఆధిక్యతతో ఎమ్మెల్యేగా గెలిచిన 57 ఏళ్ల ప్రభాతి పరిడా ఉన్నారు. శాసనసభలో మహిళకు ప్రాతినిధ్యం కల్పించేందుకు ముఖ్యమంత్రిగా కాకున్నా ఉప ముఖ్యమంత్రిగా వీరిలో ఒకరికైనా అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నారు.

రేసులో ఉన్నవారు వీరే...

బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, పరాజిత ఎమ్మెల్యే మన్మోహన్ సామల్, సురమా పాఢి, ప్రభాతి పరిడా, కనక వర్ధన్ సింగ్‌దేవ్, మోహన్ మాఝి, సురేష్ పూజారి రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి ఆశావాదులుగా ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థిగా ఓటమి చవిచూసినా రాష్ట్రస్థాయిలో ఘన విజయానికి సమర్థవంతమైన దక్షత చాటుకున్న ఘనత తనదే కావడంతో అధిష్టానం తనకు ముఖ్యమంత్రిగా పట్టం గడుతుందని మన్మోహన్ సామల్ ఆశపడుతున్నారు. ఇటువంటి అవకాశం ఉత్తరాఖండ్‌లో ఓటమి ఎమ్మెల్యే అభ్యర్థి పుష్కర్ సింగ్ ధామికి బీజేపీ కేంద్ర నేతృ బృందం కల్పించిన రీతిలో తనకు ముఖ్యమంత్రి హోదా వరిస్తుందని ఉవ్విళ్లూరుతున్నారు.

శాసనసభకు సరికొత్త ముఖాలు

- తొలిసారి ఎన్నికైన 82 మంది ఎమ్మెల్యేలు

భువనేశ్వర్: కొత్త రాష్ట్ర శాసనసభలో సరికొత్త ముఖాలు కొలువుదీరనున్నాయి. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో 82 మంది మొదటిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడం విశేషం. వీరంతా అత్యధికంగా ఎన్నికల పోరులో ప్రముఖ నాయకులను ఓడించి ఎన్నిక కావడం విశేషం.

కొత్తగా ఎన్నికైన 147 మంది ఎమ్మెల్యేల జాబితాను పరిశీలిస్తే వారిలో 82 మంది తొలిసారి ఎన్నికైనవారే. అదేవిధంగా రాష్ట్రం నుంచి ఎన్నికైన 21 మంది లోక్‌సభ సభ్యుల్లో 7 మంది పార్లమెంటుకు తొలిసారిగా ఎన్నికయ్యారు. వీరంతా భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు కావడం విశేషం.

బీజేపీ నుంచి అత్యధికం

భారతీయ జనతా పార్టీ నుంచి అత్యధిక సంఖ్యలో మొదటిసారి ఎమ్మెల్యేలు విజేతలుగా నిలిచారు. ఎన్నికైన 78 మంది బీజేపీ ఎమ్మెల్యేల్లో 52 మంది కొత్త ముఖాలు. ఈ లెక్కన 67 శాతం మంది విజేతలు తొలిసారిగా శాసనసభకు ప్రాతినిత్యం వహిస్తున్నారు. బీజేపీ టిక్కెట్‌పై గెలిచిన అనేక మంది మొదటిసారి ఎమ్మెల్యేలు, ఎంపీలు, బిజూ జనతా దళ్ (బీజేడీ) నుండి అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులను ఓడించారు. కంటాబంజీ అసెంబ్లీ స్థానం నుంచి తన తొలి ఎన్నికల పోరులో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి లక్ష్మణ్ బాగ్, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌పై 16,344 ఓట్ల తేడాతో విజయం సాధించి సంచలనం రేపారు. రాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేలు, ఎంపీలు అధిక సంఖ్యలో విజయం సాధించడం చాలా మంది రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. అనుభవజ్ఞులైన రాజకీయ నాయకుల కంటే తాజా ముఖాలకు అవకాశం కల్పించేందుకు ఓటర్లు మొగ్గుచూపడంతో రాష్ట్ర రాజకీయ స్వరూపంలో పెను మార్పును ఈ ట్రెండ్ సూచిస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీకి చెందిన దుర్గా ప్రసన్న నాయక్ బిజూ జనతా దళ్ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యే అయిన అతనుస్ సబ్యసాచి నాయక్‌ను మహాకల్పడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 33,526 ఓట్ల తేడాతో ఓడించి రాష్ట్ర శాసన సభకు తొలిసారిగా ప్రాతినిత్యం వహిస్తున్నారు. ఒడిశాలో తొలిసారిగా బరిలోకి దిగిన అభ్యర్థుల విజయానికి మోదీ వేవ్, బీజేడీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత మరియు ఓటర్లలో మార్పు రావాలనే కోరిక వంటి అనేక అంశాలు కారణమని తెలుస్తుంది.

కాంగ్రెస్ నుంచి 9 మంది

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 14 స్థానాలను గెలుచుకుంది. వీరిలో 9 మంది కొత్త ముఖాలు కావడం విశేషం. ఇది విజేతల్లో 64.2 శాతంగా నమోదు అయింది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన 3 మంది స్వతంత్ర అభ్యర్థులు తొలిసారిగా బరిలోకి దిగిన వారు. వీరంతా దేబీ ప్రసాద్ మిశ్రా, ప్రణబ్ బల్వంతరాయ్ వంటి బీజేడీ ప్రముఖుల్ని ఓడించారు. అయితే బిజూ జనతా దళ్ జాబితాలో తొలిసారిగా గెలుపొందిన వారు లేకపోవడం విచారకరం. చాలా మంది అనుభవజ్ఞులైన బీజేడీ అభ్యర్థులు దాదాపు 65 శాతం స్థానాల్లో గెలిచారు.


మోదీ కొలువులో ముగ్గురు



అశ్విని వైష్ణవ్



జుయెల్ ఓరమ్



ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఏర్పాటైన మూడో విడత ఎన్డీయే మంత్రి మండలిలో రాష్ట్రానికి చెందిన 3 మంది పార్లమెంట్ సభ్యులకు స్థానం లభించింది. వీరిలో ఇద్దరు తాజా ఎన్నికల్లో పోటీ చేసి ఘన విజయం సాధించగా, ఒకరు రాజ్యసభ సభ్యుడు కావడం విశేషం. సంబలపూర్ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందిన ధర్మేంద్ర ప్రధాన్‌కు విద్యాశాఖ, సుందరగడ్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన జుయెల్ ఓరమ్‌కు గిరిజన శాఖ, రాజ్యసభ సభ్యుడు అశ్విని వైష్ణవ్‌కు రైల్వే, సమాచార, ప్రసార శాఖ మంత్రులుగా నియమితులయ్యారు.

మల్లికార్జున్ ఖర్గేతో ఎంపీ సప్తగిరి భేటీ



ఖర్గేతో ఎంపీ సప్తగిరి ఉలక

రాయగడ: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక సోమవారం భేటీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి రెండోసారి ఉలక విజయం సాధించడంతో అభినందించారు. రాష్ట్రంలోని 21 లోక్‌సభ స్థానాలకు గాను కాంగ్రెస్ ఒకే ఒక్క స్థానాన్ని గెలుచుకుంది. అదీ కొరాపుట్ లోక్‌సభ స్థానం కావడం విశేషం. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఇదే స్థానంలో కాంగ్రెస్ విజయం సాధించడం విశేషం.

బీజేడీ ఓటమికి అనేక కారణాలు

- నబరంగ్‌పూర్ జిల్లా కార్యదర్శి ఆశిష్ పట్నాయక్



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో బీజేడీ ఓటమికి అనేక కారణాలున్నాయని ఆ పార్టీ జిల్లా సాధారణ కార్యదర్శి ఆశిష్ రంజన్ పట్నాయక్ (మొంటు) అన్నారు. పార్టీ ఓటమి తర్వాత మొదటిసారి మొంటు స్పందించారు. 1997 డిసెంబర్ 26వ తేదీన బీజేడీ పార్టీ ఆవిర్భవించిన రోజు తాను పార్టీలో చేరి రాజకీయ జీవితం ప్రారంభించానన్నారు. నాడు దివంగత మంత్రి జాదవ మజ్జి జిల్లా అధ్యక్షునిగా ఉండగా, తాను జిల్లా యువజన అధ్యక్షుడిగా 2008 వరకు కొనసాగానన్నారు. నాటి నుంచి పార్టీలో ప్రతి పరిస్థితి చోట తాను సాక్ష్యంగా ఉన్నానని పేర్కొన్నారు. ముఖ్యంగా పాండ్యన్ వేదిక మీదకు రావడాన్ని ప్రజలు అంగీకరించలేదన్నారు. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా ఉందన్నారు. ప్రధాని మోదీ నబరంగ్‌పూర్ జిల్లా పర్యటన తర్వాత జిల్లాలో ప్రజల వైఖరి మారి, బీజేపీకి అనుకూల పవనాలు వీచాయని తెలిపారు. డాబుగాం నియోజకవర్గంలో బీజేడీ ఎమ్మెల్యే మనోహర్ రంధారి విజయం అతని వ్యక్తిగత కష్ట ఫలితమే అన్నారు. ప్రజల వద్దకు చేరుకోవడంలో రంధారి చాలా కృషి చేశారని అభినందించారు. జిల్లా ముఖ్య నాయకులైన రమేష్ మజ్జి, ప్రదీప్ మజ్జిల మధ్య దూరం కూడా జిల్లాలో ఓటమికి కారణంగా చెప్పారు. ఎన్నికల ముందు బీజేపీలో చేరిన నాయకుల వలన ఆ పార్టీ విజయం సాధించింది అనే వాదన సరైంది కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ హవా నడిచిందన్నారు.

లక్ష్మీపూర్‌లో విస్తరించిన ఆంత్రాక్స్




ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం



చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తుడు

జయపురం: కొరాపుట్ జిల్లాలో ఆంత్రాక్స్ వ్యాధి విస్తరిస్తోంది. దసమంతపూర్ సమితిలో గత కొన్ని రోజులుగా విస్తరిస్తున్న వ్యాధి ప్రస్తుతం లక్ష్మీపూర్ సమితిలో కనిపించింది. ఆ సమితిలోని ఒడియపెంట పంచాయతీ ఖొలకోణ గ్రామంలో ఒకే ఇంట్లో తండ్రీ, కుమారులు ఆంత్రాక్స్ వ్యాధికి గురయ్యారు. సమాచారం అందిన వెంటనే లక్ష్మీపూర్ కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి ఒక వైద్య బృందం ఆ గ్రామానికి చేరుకొని వ్యాధిగ్రస్తుల రక్త నమూనాలను సేకరించింది. శాంపిల్స్‌ను కొరాపుట్ సాహిద్ లక్ష్మణ్ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి పంపారు. వ్యాధిగ్రస్తులను లక్ష్మీపూర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందజేస్తున్నారు. ఆ వైద్య బృందం సమితిలో ఖెలకొణ, కొరగుడ, కాయిఝొుంకోర, చిలిశంక గ్రామాల్లో వెయ్యికి పైగా పశువులకు ఆంత్రాక్స్ వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చినట్లు డాక్టర్లు వెల్లడించారు. వ్యాధి సోకినవారిని ప్రశ్నించగా మూడు నెలల కిందట వారు చనిపోయిన పశు మాంసం తిన్నట్లు వెల్లడించారు. దీంతో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. వైద్య బృందంలో డాక్టర్ శివ ప్రసాద్ మిశ్ర, గీతాంజలి దాస్, ఏఎన్ఎం కమల దేవ్, ఆర్మాసిస్టు పుస్పాంజలి, అంగన్‌వాడీ వర్కర్ శాంతిలత సాహు తదితరులు ఉన్నారు.

వడగాల్పులపై మార్గదర్శకాలు



భువనేశ్వర్: రాష్ట్రంలో వడగాలుల తీవ్రత సంకేతాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర అదనపు ప్రత్యేక సహాయ కమిషనర్ (ఏఎస్ఆర్‌సీ) పద్మనాభ బెహెరా సుందర్‌గఢ్, ఝార్సుగుడ, బర్గఢ్, సంబల్‌పూర్, సోన్‌పూర్, బొలంగిర్, నువాపడాతో సహా 7 జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. ఈ ప్రాంతాల్లో ప్రబలంగా ఉన్న వేడిగాలుల పరిస్థితుల దృష్ట్యా ప్రజలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న 5 రోజుల్లో పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత క్రమంగా 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు పెరుగుతుందన్నారు. ఈ వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా వేడి మరియు తేమతో కూడిన వాతావరణ పరిస్థితులతో పాటు తీవ్ర వడగాలుల పరిస్థితులు ఉండే అవకాశం ఉంది. తదుపరి అత్యధిక ప్రాంతాల్లో వాతావరణంలో పెద్ద మార్పు ఉండదని ఐఎండీ ముందస్తు సమాచారంగా పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య కార్మికులకు బయట పనిలో నియమించరాదు. ఈ సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. ప్రజలు వేడి, తీవ్రమైన సూర్యరశ్మికి ఎక్కువ సేపు గురవ్వకుండా జాగ్రత్తగా ఉండాలి. పగటిపూట ఆరుబయట తిరిగే పరిస్థితుల్లో లేత రంగు కాటన్ దుస్తులు ధరించి, తలకు కప్పి, తడితుండు అందుబాటులో ఉంచుకోవాలి. నీరు, లస్సీ, ఓఆర్ఎస్ ఇతరేతర ఇంట్లో తయారుచేసిన పానీయాలతో సహా తగినంత ద్రవాలను తరచు తాగడంపై ప్రజలు శ్రద్ధ వహించేలా అవగాహన పెంపొందించాలి. మిట్ట మధ్యాహ్నం వేళ ప్రత్యక్ష సూర్యరశ్మి తాకకుండా జాగ్రత్త వహించాలి.

క్లుప్తంగా

మృతుని కుటుంబానికి రూ.2.5లక్షల ఆర్థిక సాయం



కవిటిలో సాంబమూర్తి భార్య వసంతకు నగదు అందిస్తున్న 104 సిబ్బంది

కవిటి: మండలంలోని 104 సంచార వైద్యసేవల వాహనంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తూ మృతిచెందిన పొల్లాయి సాంబమూర్తి మరణం బాధాకరమని సహచర సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు మృతుడు సాంబమూర్తి ఇంటికి చేరుకున్న సిబ్బంది వారి కుటుంబానికి ఆదుకోవడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన రూ.2.5లక్షల నగదును మృతుడి భార్య పొల్లాయి వసంతకు అందజేశారు. సాంబమూర్తి కుటుంబాన్ని ఆదుకోవాలని సంఘాలకు విజ్ఞప్తి చేశారు. దీనిపై అరబిందో సంస్థ యాజమాన్యంతో హెచ్‌ఆర్ విశ్వనాథంతో కూడా మాట్లాడారు. సాంబమూర్తి భార్య పొల్లాయి వసంత కూడా ఉన్నత విద్యావంతురాలు కావడంతో ఆమెకు కొలువు ఇచ్చేందుకు అంగీకరించడంపై బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

'బడి ఈడు పిల్లల్ని పనిలో పెట్టవద్దు'



టెక్కలిలో స్వీట్ కార్ఖానాలో తనిఖీలు చేస్తున్న కార్మిక శాఖ, చైల్డ్ అండ్ లేబర్ కంట్రోల్ సిబ్బంది

టెక్కలి: బడి ఈడు పిల్లల్ని పనిలో పెట్టవద్దని సహాయ కార్మిక శాఖాధికారి ఆర్.రాధాకుమారి హెచ్చరించారు. సోమవారం చైల్డ్ అండ్ లేబర్ కంట్రోల్ సిబ్బందితో కలిసి పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార దుకాణాల్లో చిన్న పిల్లల్ని పనిలో పెడితే అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందజేయాలన్నారు. ఆమెతో పాటు ఏఎస్ఐ వెంకటరమణ, చైల్డ్ అండ్ లేబర్ కంట్రోల్ సిబ్బంది ఎం.సునీత, పీవీ అప్పలనాయుడు, ఎస్.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'బాలుడి మృతిపై సమగ్ర విచారణ చేయాలి'



డీసీహెచ్ఎస్‌కి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: మండలంలోని చిన్ననారాయణపురం గ్రామానికి చెందిన దాసరి సాయివినీత్ అనే బాలుడు పాము కాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆ బాలుడి మృతికి వైద్యులు, 108 సిబ్బంది కారణమని తెలుపుతూ గత కొద్దిరోజులుగా కుటుంబసభ్యులతో పాటు పలువురు ఆరోపణలు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం మానవహక్కుల సంఘం ప్రతినిధులు అనపాన జనార్ధన్ రెడ్డి, పి.చందు, సంజీవరావులు సోమవారం జిల్లా డీసీహెచ్ఎస్ అధికారి జీవీ రాజ్యలక్ష్మిని కలిసి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని వినతి పత్రం అందించారు.

అగ్రి పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ఆచార్య ఎంజీ రంగా అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం అనుబంధంగా నిర్వహిస్తున్న అగ్రి పాలిసెట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. గోపీ ప్రసాద్ తెలిపారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ సంస్థలో సోమవారం వివరాలు వెల్లడించారు. నేరుగా 10వ తరగతి విద్యార్హత ఆధారంగా ఆన్‌లైన్‌లో డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు రుసుం బీసీ, ఓసీలకు రూ. 600, ఎస్సీ, ఎస్టీలకు రూ.500గా తెలిపారు. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. స్థానిక కళాశాలలో పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్‌లో 40 సీట్లు, పాలిటెక్నిక్ ఆఫ్ హార్టికల్చర్‌లో 40 సీట్లు, పాలిటెక్నిక్ ఆఫ్ వెటర్నరీలో 50 సీట్లు, పాలిటెక్నిక్ ఆఫ్ ఫిషరీస్‌లో 50 సీట్లు ఉన్నాయని అన్నారు. ఈ రెండేళ్ల కోర్సుల్లో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నా యని తెలిపారు.

ప్రమాణ స్వీకారానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

భువనేశ్వర్: ఈనెల 12వ తేదీన స్థానిక జనతా మైదాన్‌లో జరగనున్న రాష్ట్రంలో తొలి బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం అనుబంధ వర్గాలు పూర్తిగా సన్నద్ధమవుతున్నాయి. భారీ ఎత్తున జరగనున్న ఈ కార్యక్రమానికి అత్యంత ప్రముఖులు హాజరు కానున్నారు. వీరికి స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) నుంచి కార్యక్రమం ప్రాంగణం వరకు రాకపోకలు పురస్కరించుకుని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సహా ఇతర ప్రముఖులు రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది.

ప్రధాని మోదీ రోడ్ షో

ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజేపీకి సేవ చేసేందుకు అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రధాన కార్యక్రమానికి హాజరయ్యే ముందు ప్రత్యేక రోడ్ షో కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మేరకు స్థానిక జయదేవ్ విహార్ నుంచి జనతా మైదాన్ వరకు ఉన్న మార్గంలో భద్రతా చర్యలతో పాటు ట్రాఫిక్ కదలికలపై ప్రత్యేక ఆంక్షలు జారీ చేశారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం కార్యక్రమ పురస్కరించుకుని ప్రత్యేక చర్యల్లో భాగంగా స్థానిక విమానాశ్రయం వద్ద 4 పోలీసు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నారు. స్థానిక మేఫెయిర్ హోటల్‌లో కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖులు బస చేసే అవకాశం ఉందని అనుబంధ వర్గాల సమాచారం. కమిషనరేట్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ మరియు రాష్ట్ర సచివాలయంలో ఉన్న రెండు కంట్రోల్ రూమ్‌ల నుంచి శాంతిభద్రతలు, ట్రాఫిక్ పరిస్థితిని పర్యవేక్షిస్తారు. ఒక ఐజీ ర్యాంక్ అధికారి, 13 నుంచి 14 మంది ఎస్పీ ర్యాంకు అధికారులు, 70 ప్లాటూన్ల పోలీసు బలగాలను ఈ కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు మోహరించనున్నట్లు పోలీసు కమిషనరు సంజీబ్ పండా తెలిపారు.

భవనాలపై పోలీసుల మోహరింపు

పోలీస్ కమిషనర్ నిర్ణయం ప్రకారం జనతా మైదాన్ సమీపంలో ఉన్న ఎత్తైన భవనాలపై పోలీసు బలగాలను మోహరిస్తారు. వేడుకలకు భారీగా తరలివచ్చే జనాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ నిబంధనలు విధిస్తారు. భద్రతా చర్యలపై కమిషనరేట్ పోలీసులు ఇప్పటికే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ)తో చర్చలు జరిపారు. ఇది కాకుండా వీవీఐపీలకు భద్రత కల్పించే ఎన్ఎస్‌జీ, సీఆర్పీఎఫ్ వంటి ఇతర ఏజెన్సీలతో పోలీసులు సమన్వయంగా పని చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి వీవీఐపీలతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా 35 వేల మందికిపైగా సాధారణ జనం పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయి. ఇలా తాత్కాలిక భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ, కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి అతిరథ, మహారథ అతిథులకు సంబంధించిన వివరాలు అందిన తర్వాత తుది పోలీసు మోహరింపు, ట్రాఫిక్ మళ్లింపుల వ్యూహం ఖరారవుతుందన్నారు.

విమానాశ్రయంలో భద్రతా చర్యలు

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు విచ్చేసే వీవీఐపీల తరలింపును నిర్వహించడానికి బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. నిర్ధారిత నిర్వహణ నియమావళి (ఎస్ఓపీ) ప్రకారం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భువనేశ్వర్ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ప్రసన్న ప్రధాన్ తెలిపారు.

లోయలో పడిన ఆటో



అందరూ బంధువుల పెళ్లి భోజనానికి హాజరయ్యారు. పెళ్లిలో సందడి చేశారు. మధ్యాహ్న భోజనం చేశాక తిరిగి స్వగ్రామానికి పయనమయ్యారు. పెళ్లి ముచ్చట్లు చెప్పుకుంటూ సాగుతున్న వీరిలో ఒక్క కుదుపు వచ్చింది. క్షణాల్లో ఆటో అదుపు తప్పి లోయలోకి బోల్తా కొట్టడంతో హాహాకారాలు ఆ ప్రాంతంలో మిన్నంటాయి. ప్రయాణికులందరూ చెల్లాచెదురుగా పడిపోయారు. రాళ్లపై పడిన వారికి తీవ్రగాయాలై లేవలేని స్థితిలోకి చేరుకున్నారు. సమీప గ్రామాల ప్రజలు వచ్చి వీరికి సపర్యలు చేశారు. 108లో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

- కొమరాడ మండలం ఖేర్జల రోడ్డులో అదుపు తప్పడంతో ఘటన
- 16 మందికి తీవ్రగాయాలు
- క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలింపు
- గడచిన 15 రోజుల్లో ఐదు రోడ్డు ప్రమాదాలు
- క్షతగాత్రులైన 55 మంది



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడిన ప్రయాణికులు



మృతి చెందిన కద్రక చింతలమ్మ చినతల్లి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురంటౌన్/కొమరాడ /రాయగడ: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని ఘాట్ రోడ్లలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. అతివేగం, అజాగ్రత్త, మద్యంతాగి వాహనాలు నడపడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని పోలీసులు తేల్చి చెబుతున్నారు. పోలీస్, రవాణాశాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నా నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. గడచిన 15 రోజుల్లో జరిగిన ఐదు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా 55 మందివరకు గాయపడ్డారు. ఓ ఐదు రోడ్డు ప్రమాదాలు ఆటోలే కావడం గమనార్హం. కొమరాడ మండలం ఖేర్జల రోడ్డులో సోమవారం అదుపుతప్పి ఓ ఆటో లోయలో పడడంతో 16 మంది గాయపడగా, ఒకరు మృతిచెందారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా బందుగాం బ్లాక్ కత్తులకవిటి పంచాయతీ కబేటీ గ్రామానికి చెందిన పలువురు ఆంధ్రాలోని పార్వతీపురం మన్యంజిల్లా కొమరాడ మండలం కుజ్జాబడి గ్రామంలోని బంధువుల పెళ్లి విందుకు సోమవారం హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం అయ్యాక ఆటోలో తిరిగి ఒడిశాలోని స్వగ్రామానికి బయలుదేరారు. కొమరాడ మండలం పెదఖేర్జల పంచాయతీ జల గ్రామ సమీపంలో మలుపు వద్ద ఆటో అదుపుతప్పడంతో లోయలోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పీడిక ప్రసాద్, పీడిక బాలమ్మ, కద్రక వారవ, నిమ్మక బాకీ, నిమ్మక వత్తు, పీడిక పుల్మి, పీడిక కాంతమ్మ, నిమ్మక నగేష, పీడిక సంగీత, పీడిక జియా, పీడిక లచ్చి, నిమ్మక సిమిలి, పీడిక చీముడ, పీడిక కిట్ట, కద్రక చింతలమ్మ చినతల్లి (30)లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో కద్రక చింతలమ్మ చినతల్లి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం

ఈ మధ్య కాలంలో గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణమని పోలీసులు చెబుతున్నారు. అనుభవం లేని డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, మద్యం మత్తులో వాహనాలను వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం, పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తీసుకెళ్లడం, నిద్రలేమి, సీటుబెల్టు, హెల్మెట్ ధరించకపోవడం తదితర కారణాలతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

- గత నెల 27న సీతంపేట మండలం ఒండరెల్లి ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. వారాంతపు సంత ముగించుకుని పరిమితికి మించి 17 మంది గిరిజనులు ఒకే ఆటోలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది.
- ఈ నెల 7న పార్వతీపురం పట్టణం బైపాస్ రహదారిలో వీరఘట్టం మండలం హుస్సేన్‌పురం గ్రామం నుంచి పార్వతీపురం రైల్వే స్టేషన్‌కు అతివేగంగా వస్తున్న లారీ ఆటోను ఢీకొనడంతో ఐదుగురు గాయాల పాలయ్యారు.
- ఈ నెల 7న పార్వతీపురం మండలం నర్సిపురం జనహిత పాఠశాల సమీపంలో పార్వతీపురం వస్తున్న ఆటోను వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురు గాయాల పాలయ్యారు. వీరంతా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్సపొంది ప్రాణాలతో బయటపడ్డారు.
- ఈ నెల 9 గుమ్మలక్ష్మీపురం మండలం పెదఖేర్జ మలుపులో డ్రైవర్ అవగాహన లోపం వల్ల ఆటో అదుపు తప్పి లోయలోపడింది. లుంబేసు పంచాయతీ లప్పటి గ్రామానికి చెందిన 11 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వారంతా తాడికొండ పీహెచ్‌సీలో చికిత్స పొందారు.

ప్రమాద నివారణ చర్యలు ఇలా..

నిత్యం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలి. లారీలు, ట్రాక్టర్లు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదు చేయాలి. వాహనచోదకులు విశ్రాంతి తీసుకునేలా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి. పార్వతీపురం, సాలూరు, పాలకొండ తదితర ప్రాంతాల్లో రహదారుల పక్కన ఆక్రమణలను తొలగించాలి. నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్ల లైసెన్స్ రద్దు చేయాలి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వేగనిరోధకాలు నిర్మించాలని నిపుణులు సూచిస్తున్నారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్ విడనాడాలి

వాహనాలు నడిపే డ్రైవర్లు నిర్లక్ష్యపు డ్రైవింగ్ విడనాడాలి. లేకుంటే కఠినంగా వ్యవహరిస్తాం. ఆటోలు 50 కిలోమీటర్ల వేగం మించితే వాహనాన్ని నియంత్రించలేరు. దీంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల ప్రజలు, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. డ్రైవర్లకు లైసెన్సులు లేకుంటే వాహనాలు సీజ్ చేస్తాం. రహదారి భద్రతా నియమావళిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– శశికుమార్, జిల్లా రవాణా అధికారి, పార్వతీపురం మన్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డుపై మృతదేహంతో ఆందోళన చేస్తున్న బాధితులు



పోలీసులు సీజ్ చేసిన వ్యాన్

రాయగడ: జిల్లాలోని రామనగుడ వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కృష్ణచంద్ర సతపతి (45) అనే వ్యక్తి తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే అక్కడివారు చంద్రపూర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వివరాల్లోకి వెళ్తే.. తన భార్యను ఊరికి పంపించేందుకు సతపతి బైకుపై ఉమ్మర్‌కోట్ వెళ్లే బస్సును ఎక్కించి, తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో రామనగుడ ఎస్‌బీఐ కూడలిలో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో సతపతి తీవ్రగాయాలకు గురయ్యాడు. చికిత్స కోసం తరలించినప్పటికీ ఆయన మృతి చెందడంతో కుటుంబీకులు మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి నష్టపరిహారం కోసం ఆందోళన చేశారు. దీంతో రామనగుడ నుంచి గుణుపూర్, చంద్రపూర్, బరంపురం వంటి ప్రాంతాలకు వెళ్లే వాహనాలు సుమారు 2 గంటల పాటుగా రోడ్డుపై నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న రామనగుడ ఐఐసీ జలంధర్ శెఠి సంఘటన స్థలానికి చేరుకొని కారణమైన వ్యాన్‌ను సీజ్ చేసారు. నష్ట పరిహారం చెల్లించేందుకు పోలీస్ యంత్రాంగం తరుపున సహకరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నాటుసారా ప్యాకెట్లు పట్టివేత



అరెస్టైన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

జయపురం: అక్రమంగా తరలిస్తున్న నాటుసారా ప్యాకెట్లను జయపురం ఎక్సైజ్ సిబ్బంది సోమవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సారా ప్యాకెట్లతో పట్టుబడిన వ్యక్తి బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి గొడగుడ గ్రామానికి చెందిన గోవింద హరిజన్(37)గా పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఉదయం ఎక్సైజ్ విభాగ నీలాద్రి బిహారి మిశ్ర నేతృత్వంలో ఏఎస్ఐ ఎం.లక్ష్మణరావు, తమ సిబ్బందితో పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో, బలియ గ్రామ మార్గంలో ఒక బైక్‌పై గోవింద వస్తుండగా అనుమానంతో ఆపి సోదాలు నిర్వహించారు. దీంతో నాటుసారా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. అతడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు.

నీలమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం



బట్టగజెడో వీధిలో అమ్మవారి అలంకరణ



బోయవీధిలో అమ్మవారిని అలంకరిస్తున్న కమిటీ

పర్లాకిమిడి: స్థానిక ఎనిమిదో వార్డు బట్టగొడో వీధి, బోయివీధి, రేఖానా వీధుల్లో గ్రామదేవత నీలమ్మ సంబరాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడేళ్లకు ఒకసారి జరుపుకునే ఉత్సవాలతో పర్లాకిమిడి సందడిగా మారింది. అమ్మవారికి నుడు మంగళవారం మహిళలు అట్లు, పరమాన్నంతో మొక్కులు తీర్చుకుంటారని అమ్మవారి కమిటీ సభ్యులు తెలియజేశారు. ప్రతీ సాయంత్రం అమ్మవారిని వివిధ పురవీధుల్లో ఊరేగిస్తారు.

నదిలో వృద్ధుడి మృతదేహం



వృద్ధుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: సబ్ డివిజన్ కుంద్రా సమితి కెరమటి గ్రామ పంచాయతీ కొదలిముండ గ్రామ సమీప కురులు నదిలో ఒక వృద్ధుడి మృతదేహం సోమవారం తేలుతూ కనిపించింది. ఆ మృతదేహం కొదిలిముండ గ్రామానికి చెందిన కేశవ దురువ(60)దిగా గుర్తించారు. వెంటనే వారు కుంద్ర పోలీసులకు, అగ్నిమాపక విభాగానికి తెలియజేశారు. అగ్నిమాపక సిబ్బంది నదిలో తేలిన మృతదేహాన్ని బయటకు తీయగా, దానిని పోలీసులు పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి గంపకొండ – బేజాంగివాడ గ్రామాల మధ్యనున్న తుముకిగూడ గ్రామానికి చెందిన జగ్గ పోడియమి (42)ని గుర్తు తెలియని వాహనం ఆదివారం రాత్రి ఢీకొనడంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తుముకిగూడ గ్రామానికి చెందిన జగ్గ పోడియమి భోజనం అనంతరం గ్రామస్తులతో కలిసి రహదారి వద్ద కూర్చున్నాడు. ఆ సమయంలో బేజాంగవాడ నుంచి వస్తున్న ఒక పికప్ వ్యాన్ జగ్గను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కానీ వాహనం మాత్రం ఆపకుండా వెళ్లిపోయింది. గ్రామస్తులు వెంటనే కలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్త చరణ్ దాస్ రాజీనామా



భక్త చరణ్ దాస్

కొరాపుట్: కాంగ్రెస్ ప్రచార కమిటీ పదవికి కలహండి మాజీ ఎంపీ భక్త చరణ్ దాస్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు లేఖ రాశారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఘటగా తరణి సన్నిధిలో ఎమ్మెల్యే గౌరీ శంకర్



శక్తి పీఠం వద్ద ఎమ్మెల్యే గౌరీ శంకర్ తదితరులు

కొరాపుట్: ఒడిశా రాష్ట్రంలో అతిపెద్ద శక్తి పీఠం ఘటగా తరణిని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి సోమవారం దర్శనం చేసుకున్నారు. కెందుజోర్ జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నబరంగ్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఆయన తొలిసారిగా బీజేపీ తరుపున గెలిపొందారు. దీంతో తన మొక్కుబడి తీర్చుకోవడానికి వచ్చారు. ఆయనతో పాటు నబరంగ్‌పూర్ బీజేపీ నాయకుడు దేవదాస్ మహంకుడో తదితరులు ఉన్నారు.

తాగునీటి కోసం ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

రాయగడ: తమ గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని గొకులముండ గ్రామానికి చెందిన మహిళలు ఆందోళన చేపట్టారు. సోమవారం వీరంతా గ్రామానికి సమీపంలోని టికిరి –నువాపడ కూడలిలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. సుమారు వందకు పైబడి కుటుంబాలు నివసిస్తున్న గొకులముండ గ్రామంలో గత నాలుగు నెలలుగా తాగునీటి సమస్య చాలా తీవ్రతరంగా ఉందని వాపోయారు. దీనిపై సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, అందువల్ల గత్యంతరం లేక తామంతా రోడ్డెక్కాల్సి వచ్చిందని తెలిపారు. ఆందోళనతో రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న టికిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళకారులను నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అందుకు ససేమిరా అంగీకరించకపోవడంతో కాసీపూర్ ఏబీడీవో పద్మిని కుహరో అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. మరో రెండు వారాల్లో తాగునీటి సమస్య మెరుగుపరుస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తి మృతి



నందూరు ఢిల్లీరావు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం వంతెన వద్ద ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొనడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మండలం సన్యాసిపుట్టుగ ఎస్సీ వీధికి చెందిన నందూరి ఢిల్లేశ్వరరావు(42) అలియాస్ శంకర్ సోమవారం చీకటి పడుతున్న సమయంలో విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఈదుపురం వంతెనపై నుంచి స్వగ్రామానికి వస్తుండగా, అదే రహదారి గుండా, అదే గ్రామానికి చెందిన నీలాపు సంతోష్ కుమార్ తన ద్విచక్ర వాహనంపై ఇచ్ఛాపురం వెళ్తున్నాడు. ఈదుపురం వంతెన వద్ద ఎదురుగా వస్తున్న ఈ రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీ కొనడంతో ఢిల్లేశ్వరరావు ఎగిరి అల్లంత దూరంలో వంతెనపై పడ్డాడు. సంతోష్ కూడా కిందపడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఢిల్లేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించగా, సంతోష్ కుమార్ పరిస్థితి ఆందోళనగా ఉండటంతో బరంపురం పెద్దాస్పత్రికి తరలించారు. మృతుడు ఢిల్లేశ్వరరావుకు భార్య లక్ష్మీతో పాటు పన్నెండేళ్ల కుమార్తె మేఘన, ఎనిమిదేళ్ల కుమారుడు వికాశ్‌లు ఉన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ భోజరాజు మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



మృతుడు రాములు (ఫైల్)

టెక్కలి రూరల్: మండలంలోని అక్కవరం గ్రామానికి చెందిన ఈది రాములు(75) అనే వ్యక్తి సోమవారం విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందు తూ మృతి చెందారు. ఈ మేరకు టెక్కలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం అక్కవరం గ్రా మంలో జరిగిన ఒక శుభకార్యానికి సంబంధించి సామగ్రిని తీసుకు వచ్చిన వ్యాన్ సామగ్రిని అన్‌లోడ్ చేసుకు ని తిరిగి వెనక్కి తీస్తుండగా అక్కడకే నిలబడి ఉన్న రాములును ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి విశాఖపట్నం తరలించగా అక్కడ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన సోమ వారం మృతి చెందారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాములు ఆర్ఐగా పని చేసి రిటైరై ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆయనకు భార్య దమయంతి ఉన్నారు.

క్లుప్తంగా

కాశీలో కన్నుమూత


లింగం సరోజిని (ఫైల్)

వీరఘట్టం: స్థానిక బీసీ కాలనీకి చెందిన లింగం సరోజిని(54) కాశీ పుణ్యక్షేత్రంలో సోమవారం కన్ను మూశారు. కాలనీలోని కొందరు మహిళలతో కలిసి ఈనెల 5న కాశీయాత్రకు ఆమె బయలుదేరి వెళ్లారు. అక్కడి నుంచి అయోధ్యలో బాల రాముడిని దర్శించుకుని, తర్వాత ప్రయోగ రాజ్‌లోని గంగ, యమునా, సరస్వతి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు చేసి తిరిగి కాశీలో బస చేసిన హోటల్‌కు ఆదివారం చేరుకున్నారు. అయితే అక్కడ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో బసచేసిన హోటల్‌లో నిద్రలోనే సరోజిని మృతి చెందినట్లు ఆమెతో వెళ్లిన వారు తెలిపారు. కాశీలోని గంగానది ఒడ్డునే ఆమె దహన సంస్కారాలు చేసేందుకు కుటుంబసభ్యులు సోమవారం పయనమయ్యారు. ఆమె కుమారుడు వెంకటరమణ వీరఘట్టంలోని పంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు.

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత


బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న ఎస్సై నరేష్

విజయనగరం క్రైమ్: స్థానిక రిలయన్స్ షాపింగ్ మాల్‌లో షాపింగ్ తర్వాత బ్యాగ్ పోగొట్టుకున్న అప్పలనరసమ్మ అనే మహిళ డయల్ 100కి కాల్ చేసి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన వన్‌టౌన్ ఎస్సై నరేష్ సమీప ప్రాంతంలో విచారణ చేశారు. ఆ బ్యాగ్ మరో మహిళకు దొరకడంతో ఆమె పోలీసులను సంప్రదించి బ్యాగ్ అందజేసింది. దీంతో పోలీసులు బాధితురాలికి ఫోన్ చేసి రప్పించి బ్యాగ్ దొరికిన మహిళ చేతుల సమక్షంలో బాధితురాలికి అందించారు. దీంతో బాధితురాలు ఆనందం వ్యక్తం చేసింది.

విత్తనాల షాపుల తనిఖీ

సాలూరు రూరల్/సాలూరు: మండలంలోని విత్తనాల షాపులను వ్యవసాయ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ మేరకు సాలూరు మండలంలోని మామిడిపల్లిలో ఉన్న రెండు విత్తనాల షాపులతో పాటు మండలంలో గల పలు షాపులను పరిశీలించారు. వీరఘట్టం ఏఓ జె.సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో భాగంగా వ్యాపారులకు పలు హెచ్చరికలు జారీచేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని అలా కాకుండా నాసిరకం విత్తనాలు అమ్మినవారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే నిర్దేశించిన ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎంఏఓ పి.అనురాధ, ఏఈఓ కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ ఢీకొని యువకుడి మృతి


జగదీశ్వర రావు(ఫైల్)

బొబ్బిలి: పట్టణంలోని సాయినగర్‌కు చెందిన నాయుడు జగదీశ్వర రావు(30) అనే యువకుడు ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తూ డివైడర్ ఢీకొని మృతి చెందాడు. పట్టణంలోని తన ఇంటికి వెళ్లే క్రమంలో ఫ్లై ఓవర్ వద్ద డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే బొబ్బిలి ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెంచూరియన్ వర్సిటీ సందర్శన

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలిలో ఉన్న సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని విశాఖకు చెందిన ప్రావిడెంట్ ఫండ్ మాజీ కమిషనర్ ఎస్వీఎస్ రామచంద్ర రాజు, బీహెచ్‌పీవీ మాజీ జనరల్ మేనేజర్ డీఎస్ వర్మ సోమవారం సందర్శించారు. వర్సిటీలో ఉన్న అత్యాధునిక ల్యాబ్‌లు, పరికరాలను పరిశీలించారు. చాన్సలర్ జీఎస్ఎన్ రాజు యూనివర్సిటీలో ఉన్న ప్రత్యేకతలను వారికి వివరించారు. సెంచూరియన్‌లో సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని వక్తలు కితాబిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్‌లు పీఎస్వీ రమణారావు, ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ దీపక్, డాక్టర్ సూర్యతేజ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగం ఆలయ భూముల సాగువేలం వాయిదా

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఆలయం భూముల సాగు వేలం వాయిదా వేసినట్లు ఈఓ పి.ప్రభాకరరావు సోమవారం తెలిపారు. మొత్తం భూములు 29.99 ఎకరాలకు గాను కార్యాలయం ఆవరణలో సాగున(కౌలు)కు వేలం పాట ప్రారంభించారు. సాగునకు నిర్దేశించిన కౌలు మొత్తం ఎక్కువ కావడంతో రైతులు వేలంనకు ఆసక్తి చూపలేదు. దీంతో ఈ వేలం పాట వాయిదా వేసినట్లు ఈఓ ప్రభాకరరావు తెలిపారు. తదుపరి వేలం తేదీ త్వరలో ప్రకటించనున్నామని ఈఓ తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి అదును

- ఎర్ర, నల్ల నేలల్లో యాజమాన్య పద్ధతులు అవసరం
- ఎరువుల వినియోగంపై అవగాహన తప్పనిసరి


ఎర్ర నేలల్లో పంటలు వేసేందుకు యంత్ర సాయంతో సిద్ధం చేస్తున్న వైనం


నల్ల నేలల్లో దుక్కులు చేస్తున్న రైతులు

పాలకొండ రూరల్: జిల్లాలో అధికశాతం వ్యవసాయం వర్షాధారంగానే జరుగుతోంది. మెట్ట సాగులో 55 శాతం ఎర్రనేలలు, 45 శాతం నల్లరేగడి నేలలు ఉన్నాయి. ఏటా వర్షపాతం నమోదులో సమతుల్యత అనుకున్న విధంగా ఉండదు. వానలు సకాలంలో పడకపోవడంతో ఆశించిన మేర దిగుబడులు ఉండవు. ఈ క్రమంలో రైతులు యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటించి నష్టాల నివారణ దిశగా అడుగువేయాలని వ్యవసాయ శాఖ ఎ.డి కె.రత్నకుమారి పేర్కొంటున్నారు.

ఎర్ర నేలల్లో..

ఈ క్రమంలో సహజంగా ఎర్రనేలల్లో లోతు తక్కువగా ఉంటుంది. అందువల్ల నీటిని నిలుపుకునే సామర్థ్యం కూడా తక్కువ. ఈ సీజన్‌లో వర్షం ద్వారా లభించే నీరు నష్టపోవడమే గాక సారవంతమైన మట్టి పై పొర కొట్టుకుపోతుంది. దీనిని నివారించడానికి వాలుకు అడ్డంగా సేద్యం చేసుకోవాలి. అడ్డ గట్లు ఏర్పాటు చేయాలి. వాలుకు అడ్డంగా దుక్కి దున్నడం వల్ల, విత్తడం, అంతరకృషి చేయడం వల్ల నీటి ఒరవడిని ఎక్కడికక్కడే అరికట్టి ఎక్కువ నీరు భూమిలోకి ఇంకేలా చేయవచ్చు. 2 శాతం వాలు కలిగిన నేలల్లో ప్రతి 50 మీటర్ల దూరానికి 0.63 ఘనపు మీటర్ల పరిమాణంలో గట్లు వేయాలి.

ఎరువుల యాజమాన్యం ఇలా..

- వేరుశనగలో కంది అంతర పంటకు విత్తే ముందు ఎకరాకు 8 కిలోల నత్రజని, 16 కిలోల బాస్వరం, పొటాషియం ఎరువులు వేయాలి.
- జొన్న, సజ్జ పంటలకు 16 కిలోల నత్రజని, భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి.
- ఉలవకు 4 కిలోల నత్రజని, 12 కిలోల బాస్వరం వేయాలి. భూసార పరీక్షలను అనుసరించి బాస్వరం, పొటాష్ ఎరువులను అధికారులు సూచనల మేరకు వాడుకోవాలి.
- వేరుశనగకు భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు వాడాలి. నేలలో లభ్యమయ్యే బాస్వరం ఎకరాకి 10 శాతం కంటే తక్కువగా ఉంటే 16 కిలో, 10 నుంచి 20 ఉంటే 8 కిలోల బాస్వరం వేయాలి.
- భూమిలో లభించే పొటాష్ 60 శాతం కంటే తక్కువగా ఉంటే 16 కిలోలు, 60–120 కిలోల మధ్య ఉంటే పొటాష్ 8 కిలోలు వేయాలి. 120 శాతం మించితే పొటాష్ వేయనవసరం లేదు.
- జింక్ లోపం ఉన్న నేలల్లో వేరుశనగ విత్తిన 35 రోజులకు, 45 రోజులకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నేలపై పొర గట్టిపడే భూముల్లో ఎకరాకు 10–15 టన్నుల ఇసుకతో కలియదున్నాలి. ఇటువంటి నేలల్లో వేరుశనగ పంట అనుకూలంగా ఉంటుంది. ఈ మొక్కల వేళ్లు సులభంగా నేలలో దిగి దిగుబడి లభిస్తుంది. వర్షపునీరు బాగా భూమిలో ఇంకిపోవడం వల్ల నీటి వృథా తగ్గుతుంది. వేరుశనగలో అంతర పంటగా కంది, ఉలవలు వేస్తే మంచి ఫలితం ఉంటుంది.

వర్షపు నీటి యాజమాన్యం..

మెట్ట ప్రాంతాల్లో 10 నుంచి 40 రోజుల వరకు పంట కాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడవచ్చు. ఒక్కోసారి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడం వల్ల పొలం నుంచి నీరు పొంగి పొర్లుతుంది. ఈ నీటిని నీటికుంటలో నిల్వచేసి పైరు 10 రోజులకు మించి వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడు స్ప్రింక్లర్ల ద్వారా గంటసేపు తడిపితే 20–30 శాతం దిగుబడి పెరుగుతుంది. నీటి కుంటలను 10 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు, 2.5 మీటర్ల లోతులో తవ్వుకోవాలి. నీటి కుంటల్లో నీరు నిల్వ ఉండడానికి ఆరు భాగాలు మట్టి, ఒక భాగం సిమెంట్ తగినంత నీటిని కలిపి కుంటలోపలి భాగంలో పూయాలి. దీనివల్ల కుంటలో నీరు 2 నెలల వరకు నిల్వ ఉంటుంది. వేరుశనగ, పత్తి, కంది, శనగ, జొన్న తదితర పంటల్లో కీలక దశలో ఈ నీటిని వాడుకోవచ్చు. అనంతరం వేరుశనగ విత్తే పరికరంతో విత్తిన పొలాల్లో కలుపు నివారణకు ట్రాక్టర్‌తో నడిచే అంతర కృషి పరికరాన్ని వాడవచ్చు. దీంతో వరుసల మధ్య కలుపును సులభంగా నియంత్రించవచ్చు. హెక్టారు వేరుశనగ పంటతో పాటు 10 గొర్రె పిల్లల్ని నాలుగు నెలలు పెంచితే అదనపు ఆదాయం, పలువురికి ఉపాధి మార్గం లభిస్తుంది.

నల్ల నేలలు..

నల్ల నేలలకు నీటి నిల్వ ఉంచుకునే శక్తి ఎక్కువ. వర్షపు నీరు త్వరగా ఇంకిపోదు. అందువల్ల అధిక శాతం నీరు, మట్టి కొట్టుకుపోతుంది. ఈ నేలల్లో దున్నడం, సంరక్షణలో సాంకేతిక పద్ధతులు అవలంబించాలి. ఎర్రనేలలకు వేసే గట్ల మాదిరే నల్ల నేలలకు గ్రేడెడ్ గట్లు వేయాలి. 0.80 ఘనపు మీటర్ల గ్రేడెడ్ గట్లు వేసుకోవాలి. గట్ల పైగా 0.1-0.25 శాతం వాలుతో నీరు పోవడానికి కాలువ తీసి దీనిని పెద్ద కాలువతో కలిపి నేల కోత లేకుండా నీటిని బయటకు పోయేలా చూడాలి. వెడల్పాటి బోదెలు, కాల్వలుగా నేలను తయారు చేసి బోదెల పైన విత్తుకోవాలి. కాల్వలు ఎక్కువైనా నీటిని బయటకు పంపడానికి ఉపయోగపడతాయి. మూడు మీటర్ల వెడల్పుతో 20 సెం.మీ ఎత్తు గల వెడల్పాటి బోదెలు చేసి విత్తుకుంటే మంచి దిగుబడులుంటాయి. ఎకరాకు 8 టన్నుల పశువుల ఎరువు వేస్తే నీరు బాగా ఇంకుతుంది.

మెట్ట భూములకు అనువైన పండ్ల తోటలు..

తక్కువ నీటితో ఫలసాయాన్ని ఇచ్చే రేగు, సీతాఫలం, మామిడి, సపోటాలను మెట్ట భూముల్లో సాగుచేయవచ్చు. సాగునీరు అందించే పరిస్థితుల్లో దానిమ్మ, సపోటా, మామిడి పంటలను సాగుచేసి వాటిలో మూడేళ్ల వరకు అంతర పంటలు వేసి అధిక ఆదాయం పొందవచ్చు.

ఉపాధి హామీ ద్వారా తోడ్పాటు



తోటల పెంపకానికి ఉపాధిహామీ ద్వారా తోడ్పాటు లభిస్తుంది. జిల్లాలో ఉద్యానవన పంటలు దాదాపుగా లక్ష 10వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. జీడిమామిడి 68, పామాయిల్ 17, అరటి 12 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మిగిలిన భూమిలో నేల పనస, మామిడి, పనస, ఇతర పంటలు సేద్యం చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 3 వేల ఎకరాలలో 3,500 మంది రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా తోడ్పాటు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. లక్షా 42వేల పైచిలుకు ఉపాధి జాబ్‌కార్డుదారులకు పనులు కల్పించడమే లక్ష్యం. ముఖ్యంగా మామిడి, సపోటా, జామ, జీడిమామిడి, బత్తాయి, నిమ్మ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, మునగ, గులాబీ, మల్లె తోటలకు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. నేల స్వభావానికి అనుగుణంగా రైతులు ఏ పండ్ల తోటలు వేసుకోవాలో ఉద్యానశాఖ అధికారుల సలహా తో ముందుకు వెళ్లాలి.

– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ ఎ.డి., పాలకొండ

ఉల్లాసంగా ఎడ్ల పరుగు ప్రదర్శన

- ప్రథమ స్థానంలో నిలిచిన లక్కవరం ఎడ్లు


పండగకు విద్యుత్‌దీపాల అలంకరణతో ముస్తాబైన అమ్మవారి ఆలయం


బక్కునాయుడుపేటలో పరుగు ప్రదర్శనలో ఎడ్లు

వేపాడ: మండలకేంద్రం వేపాడ శివారు బక్కునాయుడుపేటలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగింది. గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల నేతృత్వంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 16 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన లక్కవరం నేముల నరేష్ ఎడ్లు నిలిచి ప్రథమ స్థానంలో నిలిచి రూ.12 వేల నగదు బహుమతి సాధించాయి. అలాగే రెండోస్థానంలో అజ్జనగిరికి చెందిన పరవాడ నాయుడు ఎడ్లు రూ.పదివేలు, మూడో స్థానంలో నెక్కల వానిపాలెం గ్రామానికి చెందిన పైడితల్లమ్మ అమ్మవారి ఎడ్లు రూ.ఎనిమిదివేలు, నాలుగో స్థానంలో కేఎల్‌బీ పట్నం గ్రామానికి చెందిన ఒ.మోహన్ ఎడ్లు రూ.ఆరువేలు నగదు బహుమతులు గెలుచుకోగా గ్రామపెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో వేపాడ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి తొలేళ్ల ఉత్సవం

బక్కునాయుడుపేట గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి పండగ సందర్భంగా సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పూర్వీకుల సంప్రదాయంగా వస్తున్న మేరకు భక్తులు రథం పైకి ఎక్కి తిరుగుతూ అమ్మవారిని ప్రార్థించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ


సీహెచ్ సుబ్బారావు అఖిల్‌రామ్ ధరేశ్వర్

సీతానగరం: ప్రభుత్వం ప్రకటించిన జేఈఈ పరీక్షా ఫలితాల్లో జోగింపేట స్కూల్‌ఆఫ్‌ఎక్స్‌లెన్స్ విద్యార్థులు సత్తాచాటారు. 2024 మే నెలలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా జోగింపేట గిరిజన (స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) ప్రతిభా విద్యాలయానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎస్టీ కేటగిరీలో ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ బి.ధర్మరాజు తెలియజేశారు. పి అఖిల్‌రామ్, సీహెచ్ సుబ్బారావు, జే.ధరేశ్వర్‌లు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆశించిన ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అధ్యాపకులు ఉపాధ్యాయులు అభిందించారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జిల్లా జడ్జి

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మను విజయనగరం జిల్లా జడ్జి రజని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికిన దేవాదాయ శాఖ సిబ్బంది ఆమెతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ అమ్మవారి ఆలయ ప్రత్యేకతను జిల్లా జడ్జికి వివరించారు.

కొనసాగుతున్న జిందాల్ కార్మికుల ఆందోళన


కర్మాగారం గేటు వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

- విరమించాలని యాజమాన్యం బహిరం లేఖ

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామం సమీపంలో గల జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారం కార్మికుల ఆందోళన కొనసాగుతోంది. ఈ కర్మాగారానికి సంబంధించిన ముడిసరుకు కొరత, మార్కెట్‌లో తయారైన సరుకుకు సరైన ధర లేకపోవడంతో గత నెల 17వ తేదీన అర్థాంతరంగా కర్మాగారాన్ని యాజమాన్యం మూసివేసింది. నాటి నుంచి కార్మికులు కర్మాగారం మెయిన్ గేటు వద్ద ఆందోళన చేస్తున్నారు, సోమవారం నాటికి వారి ఆందోళన 24 రోజులకు చేరుకుంది. కాగా సోమవారం కర్మాగారం యాజమాన్య ప్రతినిధి డీజీఎం హెచ్ ఆర్ జె.గోపాలకృష్ణ ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. కర్మాగారంలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు పూర్తిస్థాయి జీతం చెల్లిస్తామని, పర్మినెంట్ కార్మికులకు జూన్ నెల నుంచి లేఆఫ్‌ను అందిస్తామని పేర్కొన్నారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికులు ఒడిశాలో గల తమ మరో యూనిట్‌కు తరలి వెళ్లాలని పేర్కొన్నారు. తక్షణమే ఆందోళన విరమించాలని కోరారు. అయితే కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఈ లేఖపై మంగళవారం పూర్తిస్థాయిలో కార్మికులతో చర్చించి భవిష్యత్ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో జేఏసీ నాయుకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, పప్పల బంగారునాయుడు, నమ్మి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

విజయనగరం టౌన్: రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఏలూరులో నిర్వహించనున్న నేపథ్యంలో ఆ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్‌ను ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు బెహరా శంకర రావు , రెడ్డి నారాయణరావు, ఎస్.అప్పలరాజు రెడ్డి తదితరులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15న రాష్ట్రమంతటి నుంచి తరలివచ్చే రైతు కూలీలలతో ఏలూరు పట్టణంలో భారీ ప్రదర్శన, అనంతరం ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. ఏలూరు టొబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో 16, 17 తేదీల్లో ప్రతినిధుల సమావేశాలు ఉంటాయని, సభల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తామని తెలిపారు. ఆలిండియా కిసాన్ మజ్దూర్, కిసాన్ సభ కన్వీనర్ సుబోధ్ మిత్రా, ఏఐఎఫ్‌టీయూ న్యూ అఖిల భారత కార్యదర్శి అరవింద్ సిన్హా వంటి జాతీయ నేతలు మహాసభలకు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా రజక సమాఖ్య నాయకుడు జి.సత్యారావు, నవయువ సమాఖ్య ప్రతినిధి ఎం.అప్పలరాజు, మున్సిపల్ షాపుల సంఘం కార్యదర్శి డి.సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతే ధ్యేయం

- పంచాయతీల్లో పారిశుద్ధ్య డ్రైవ్

పార్వతీపురంటౌన్: గ్రామాల పరిశుభ్రతే ధ్యేయమని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు రెండవ విడత పారిశుద్ధ్య డ్రైవ్‌ను సోమవారం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు స్థానిక డీపీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ మండలాల్లో వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, అధికారులు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని సూచించారు. కాలువలలో పూడికలు తొలగించడం, రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించడం వంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా స్ప్రేయింగ్ చేయడం, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. వైద్య సిబ్బంది సమన్వయంతో గ్రామాల్లో క్రమం తప్పకుండా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధ్యాయుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన పాపారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం చిన బొండపల్లి గ్రామంలో మానసిక స్థితి సరిగా లేక ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డీకే పట్నం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా చిట్టా పాపారావు (48) విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా ఆయన మానసికస్థితి సరిగా లేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పార్వతీపురం రూరల్ ఎస్సై దినకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం


బైక్ ఢీకొని మృతి చెందిన లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సోమవారం తెలిపారు. ఈ ఘటనపై స్థానికులు అందించిన సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించి విచారణ చేశామన్నారు. మృతుడు సుమారు 65 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని, మృతదేహాన్ని మహారాజా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని ఎవరైనా మృతుడిని గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

బైక్ ఢీకొని వ్యక్తి..

సీతంపేట: ద్విచక్రవాహనం ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో సీతంపేటకు చెందిన బిడ్డిక లక్ష్మణరావు (73) అక్కడికక్కడే సోమవారం దుర్మరణం చెందాడు. విద్యుత్ బిల్లు కట్టడానికి స్థానికంగా తురాయిపు వలస సమీపంలోని ట్రాన్స్‌కో కార్యాయానికి వెళ్లి తిరిగి కాలి నడకన వస్తుండగా పాలకొండ నుంచి సీతంపేట వైపు వస్తున్న ద్విచక్రవాహన చోదకుడు బలంగా ఢీ కొట్టడంతో తలకు భారీ గాయమైంది. వెంటనే ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెబాట


శిబిరంలో కూర్చున్న మున్సిపల్ కార్మికులు

సాలూరు: మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పట్టారు.తమ సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిరసగా సోమవారం నుంచి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు విధులు బహిష్కరించి, కార్యాలయం ఎదుట శిబిరం ఏర్పాటుచేసి ఆందోళన చేపట్టారు. వేతన బకాయిలు చెల్లించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కొన్ని నెలలుగా మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. అధికారుల నుంచి స్పందన కరువవడంతో ఆందోళన చేపడుతున్నామని నాయకులు శంకర రావు, రాము తదితరులు తెలిపారు.

39 రోజులకు రూ.73.05 లక్షలు

- ఆదిత్యుని హుండీ ఆదాయం లెక్కింపు


నగదును లెక్కిస్తున్న శ్రీహరి సేవా సభ్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీ కానుకల ద్వారా రూ.73,05,873 మేరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ/డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం అనివెట్టి మండపంలో నిర్వహించారు. ఈ ఏడాది మే 2 నుంచి ఈనెల 10వ తేదీ వరకు మొత్తం 39 రోజులకు హుండీల్లో ఆదాయం రికార్డు స్థాయిలో లభించింది. నగదు రూపంలో రూ.70,38,653, చిల్లర రూపంలో రూ.2,67,120 వరకు లభించగా, 26 గ్రాముల బంగారం, వెండి 4 కేజీ 200 గ్రాముల వస్తువులతో పాటు పలు దేశాల కరెన్సీ కూడా కానుకల రూపంలో లభించాయి. విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయ ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు ప్రక్రియలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, శ్రీకూర్మం ఈఓ గురునాథరావు, టెక్కలి గ్రేడ్-3 ఈవో మనస్విని, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.